క్లుప్తంగా

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడండి



మాట్లాడుతున్న ఎంపీపీ సుజాతమ్మ

దొరవారిసత్రం : మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకుని నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్, ఎంపీడీవో శివరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్, ఏఈలు మోహన్, కస్తూరయ్య, ఏపీఎం పద్మావతి, ఏవో జ్యోతిర్మయి పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు



రాపూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

రాపూరు: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు కలుగుతుందని గ్రంథాలయ అధికారిణి ధనమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం గ్రంథాలయాల్లో దినపత్రికలు, పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రమౌళి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు వీధిలో ఉన్న జీసెస్ ఫౌండేషన్ ఆశ్రమంలో వృద్ధులకు శనివారం స్థానిక విశ్రాంత ఉపాధ్యాయులు సి.చంద్రమౌళి నెల రోజులకు సరిపడా నూనే, పప్పులు, బియ్యం బస్తా తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రముఖ సంగీత దర్శకులు ఇళయ రాజా జన్మదినం సందర్భంగా ఆయన అభిమాని చంద్రమౌళి ఆశ్రమం వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు, తినుబండారాలు పంపిణీ చేశారు. ఆయనకు ఆశ్రమ నిర్వాహకురాలు మనిరత్నమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

కలువాయి ఎంఈవోగా రేణుక



బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో కె.రేణుక

కలువాయి: మండల విద్యాశాఖాధికారి–1గా కె.రేణుక శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె పొదలకూరు ఎంఈవోగా పనిచేస్తున్నారు. కలువాయి ఎంఈవో–1 బాలకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంఈవో–2 శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

దక్కిలి: ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లు సృష్టించినా, ప్రశాంతతకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చౌడయ్య తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ విజయోత్సవాలు, ర్యాలీలను నిషేధించినట్టు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేనదన్నారు. నేరస్తులు, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రాజకీయాలపై బెట్టింగులకు పాల్పడవద్దన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని వెల్లడించారు.

నలుగురు దొంగల అరెస్ట్

దక్కిలి : సెల్ టవర్ బ్యాటరీలను చోరీ చేసిన నలుగురు దొంగలను అరెస్టు చేసినట్టు ఎస్ఐ చౌడయ్య తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తీర్థంపాడు గ్రామం వద్దనున్న బీఎస్ఎన్ఎల్ టవర్‌లో జియోకు సంబంధించిన 48 బ్యాటరీలను గతనెల 29న చోరీకి గురయ్యాయి. జియో టవర్ జేటీవో సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. శనివారం డక్కిలి మండలం మోపూరు సెంటర్ వద్ద నెల్లూరు జిలా కోవూరు వెంకటేశ్వపురం ప్రాంతానికి చెందిన దారా నవీన్, షేక్ అజీ, సయ్యద్ అయఫ్‌బాషా, షేక్ జాఫర్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

కండలేరులో 6.621 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.621 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గూడూరు రూరల్ : ఆంజనేయ స్వామికి విశేషాలంకరణ, హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు, సైదాపురం : హోమం చేస్తున్న వేద పండితులు, అన్నదానం చేస్తున్న భక్తులు, నాయుడుపేట టౌన్ : ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు







భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



సైదాపురం : ఆంజనేయస్వామికి అలంకరణ

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గూడూరులోని కోదండరామస్వామి ఆలయంలో స్వామికి చేసిన పుష్పాలంకరణ ఆకట్టుకుంది. గూడూరు రూరల్‌లోని శ్రీరామ రక్ష కుటీరంలో తమల పాకులతో సామూహిక అర్చనలు చేశారు. రాత్రి శ్రీరామ పట్టాభిషేకం, పుష్పయాగం నిర్వహించారు.

సైదాపురంలో..

సైదాపురం : స్థానిక సాయిబాబా మందిరం, పడమర వీధి, బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తోచాం సమీపంలో ఉన్న సంజీవస్వామి ఆలయం, తురిమెర్ల, చాగణం గ్రామాల్లోని ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని కురుగొండ, బండారుగుంట గ్రామాల్లో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వజ్జవారిపాళెం, చిలమానుచేను, పెదపరియ రాచపాళెం గ్రామాల్లోని శ్రీరామ మందిరాల్లో ఆంజనేయస్వామికి పొంగళ్లు పెట్టారు.

కోటలో..

కోట: స్థానిక తూర్పువీధిలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



కోటలో విశేషాలంకరణలో వీరాంజనేయ స్వామి



రాపూరులో ఆంజనేయ స్వామికి ఆకుపూజ

ఆవరణలో స్వామి ఉత్సవ విగ్రహానికి తమలపాకులతో అర్చన చేశారు. రాత్రి స్వామి వారి పల్లకీ ఉత్సవం చేపట్టారు. కొడవలూరు సుబ్బారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సిద్ధవరం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలువాయిలో..

కలువాయి: కుల్లూరులోని ఆరామ మారుతి నిలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మాదాసు గంగాధరం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి నిర్వహించిన కోలాటం భక్తులను అలరించింది.

రాపూరులో

రాపూరు: స్థానిక ఆంజనేయస్వామి, మద్దెలమడుగులోని మహావిష్ణువు అయ్యప్పస్వామి ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

పెంచలకోనలో

పెంచలకోన క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి అభిషేకం, పూలంగి సేవ, ఆకుపూజ నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తిని తిరుచ్చిపై కొలువు దీర్చి ఊరేగించారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అగ్రహారంపేటలో ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల ఆధ్వర్యంలో కలశాలలో ఉన్న జలాలతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి గ్రామోత్సవం చేపట్టారు. కోదండ రామాంజనేయ స్వామి, ఇండియన్ బ్యాంకు సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి, రాజగోపాలపురంలోని లక్ష్మణ సమేత సీతారామాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తిమ్మాజికండ్రిగలో ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహానికి భక్తులు క్షీరాభిషేకం చేశారు.

వాకాడులో..

వాకాడు : మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వాకాడు షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని అభయాంజనేయస్వామి, జానరపేట సమీపంలోని దక్షిణపాలం వద్ద అభయాంజనేయస్వామి ఆలయాలతోపాటు జెమిన్ కొత్తపాళెం, బాలిరెడ్డిపాళెం తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు. చిల్లకూరులోని దళితవాడలో ఉన్న ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో కమ్మవారిపాళెం సర్పంచ్ చిట్టేటి నారాయణ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పల్లమాల, తమ్మినపట్నం, కలవకొండలోని ఆంజనేయ స్వామి, లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.

వెంకటగిరిలో..


వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పాతకోట వీరాంజనేయస్వామి, బంగారుపేట, బొప్పాపురం ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా బాలాయపల్లి మండలంలోని పల్లిపాడు, అలిమిలి గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.



బాలాయపల్లి : పల్లిపాడులో విశేషాలంకరణలో వీరాంజనేయస్వామి








కలువాయి: కుల్లూరులో.. నాయుడుపేట టౌన్ : తిమ్మాజికండ్రిగలో ఆంజనేయ స్వామికి అభిషేకాలు, రాపూరులో అన్నదానం, పెంచలకోనలో ఆంజనేయస్వామి క్షేత్రోత్సవం, పెంచలకోన, సైదాపురంలో విశేషాలంకరణలో ఆంజనేయ స్వామి

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన కట్టా సుధాకర్‌రెడ్డి, దబ్బల శ్రీమంత్ రెడ్డి

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డితోపాటు పలువురు నాయకులు శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో కలిశారు. నియోజవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసినట్టు మంత్రికి వివరించారు. సంజీవయ్య మంచి మెజారిటీతో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి, గడవరం సురేష్ రెడ్డి, నాయుడుపేట మాజీ వైస్ ఎంపీపీ నల్లు కస్తూరయ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారం




సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన సత్యనారాయణరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిని కలిసిన సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రానుందని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన శనివారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ఫలితాలకంటే రెట్టింపు మెజారిటీతో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట అసెంబ్లీ స్థానం నుంచి కిలివేటి సంజీవయ్య భారీ మెజారిటీతో గెలుస్తారని చెప్పారు. ఆయన వెంట సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి ఉన్నారు.

భాస్కర్‌రెడ్డి సేవలు అనిర్వచనీయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట డివిజన్ అటవీశాఖలో ఫారెస్ట్ రేంజ్ అధికారిగా పనిచేస్తున్న వీరపు రెడ్డి భాస్కర్ రెడ్డిని శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను ఆ శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని కేకే కల్యాణ్ సదన్‌లో శుక్రవారం రాత్రి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 34 సంవత్సరాలుగా ఆయన విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఆ శాఖ తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి జీ సతీష్, వెంకటగిరి ఫారెస్టు డివిజనల్ అధికారి జీ జ్ఞానప్రకాష్‌రావు, సూళ్లూరుపేట వన్యప్రాణి విభాగం అధికారి పి.శామ్యూల్, వెంకటగిరి అటవీ శాఖ అధికారి బీ రాజేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు కలికి మాధవరెడ్డి తదితరులు భాస్కర్ రెడ్డికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడూరు సాయి నిషాంత్ రెడ్డి, శ్రావణి, డాక్టర్ వీరపురెడ్డి పల్లవి, భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



భాస్కర్ రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఐలు, బ్రాహ్మణ సంఘం నాయకులు

గూడూరు రూరల్ : పనులు చేసుకునే కూలీలు ఎండ తీవ్రతను తట్టుకునేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని గూడూరు రెండో పట్టణ, రూరల్ సీఐలు రవికిరణ్, వేణుగోపాల్ రెడ్డి సూచించారు. రెండో పట్టణంలోని కోర్టు సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 500 మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. సీఐలు మాట్లాడుతూ రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్నాయని తెలిపారు. మజ్జిగ, మంచి నీరు ఎక్కువగా తాగాలని సూచించారు. బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్, కార్యదర్శి, కోశాధికారులు చిట్టమూరు శ్రీనివాసరావు, లలితమ్మ, బి.శ్రీనివాసరావు, నరసింహన్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

కోట : జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ కె.నారాయణరావు శనివారం తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాల కోసం 9441215108 లో సంప్రదించాలన్నారు.

మిగులు సీట్ల భర్తీకి 7న ప్రవేశ పరీక్ష

తడ: మండలంలోని అక్కంపేటలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి 7వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సౌజన్య తెలిపారు. ఆసక్తి కల విద్యార్థులు 7వ తేదీ ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్ వద్ద జరిగే పరీక్షకు హాజరుకావాలని కోరారు.

గర్భిణులకు వైద్య సేవలు అందించాలి



గర్భిణులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

దొరవారిసత్రం : గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు విధిగా వైద్య సేవలు అందించాలని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. వారు శనివారం తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కల్లూరు గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయం పరిధిలోని గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. పలువురుకి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రకాష్, బేబి రాణి, నాగేంద్రం, వైద్యాధికారి తరుణ్‌సాయికుమార్, డాక్టర్ నవీన పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



కొక్కుపాడులో మండుతున్న గడ్డివాములు

కోట: మండలంలోని కొక్కుపాడులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.2 లక్షల విలువైన పశుగ్రాసం కాలిపోయింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కై కపల్లి పెంచలయ్య, రమణయ్య, ఉలస రమణయ్య, మురళీ తమ పశువుల కోసం వరిగడ్డిని పాఠశాల సమీపంలో వాములు వేసుకున్నారు. శనివారం ఆకతాయిలు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే మొత్తం పశుగ్రాసం కాలిపోయింది. రూ.2 లక్షలు నష్టం సంభవించినట్టు బాధితులు వాపోతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాపూరు : పెంచలకోన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మొదటి శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 4 అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి కల్యాణం చేశారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు.



కల్యాణం చేస్తున్న అర్చకులు

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కమిషనర్



నాయుడుపేటలో దివ్యాంగురాలికి పింఛను ఇస్తున్న కమిషనర్ జనార్దన్ రెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో నడవ లేని స్థితిలో ఉన్న వారు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది శనివారం ఇంటి వద్దకే వెళ్లి పింఛను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి పింఛన్ల పంపిణీని పరిశీలించారు. లోతువానిగుంట సచివాలయం పరిధిలోని పలు ఇళ్ల వద్దకు కమిషనర్ వెళ్లి వారికి నగదు పంపిణీ చేశారు. కమిషనర్ వెంట వెల్‌ఫేర్ కార్యదర్శి కిషోర్ ఉన్నారు. పురపాలక సంఘం పరిధిలోని 13 సచివాలయాల్లో 4,200 మందికి పైగా ఉన్న లబ్ధిదారుల్లో 945 మందికి ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మిగిలిన వారికి బ్యాంక్ ఖాతాల్లో నగదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా నాయుడుపేట మండల పరిధిలోని 4,010 మందికి వారి బ్యాంక్ ఖాతాలకు, మిగిలిన 1101 మందికి సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి నగదును అందజేస్తున్నట్లు ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు.

మండుతున్న ఎండలు

చిల్లకూరు : ఎండలు మండి పోతున్నాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరగడంతో జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఎక్కడ చెట్టు ఉంటే అక్కడ సేద తీరుతున్నారు. ఎండ తగ్గిన తర్వాత వెళుతున్నారు. రెండు రోజులుగా 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతోంది. శనివారం 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో డ్రైవర్లు తమ వాహనాలను కోట క్రాస్ రోడ్డు నుంచి బూదనం వరకు జాతీయ రహదారి వెంబడి ఉన్న చెట్ల కింద నిలిపివేస్తున్నారు. ఉదయం 11 గంటలు దాటిన తరువాత వాహనాల రాకపోకలు తగ్గుతున్నాయి.



బూదనం సమీపంలో చెట్ల కింద నిలిపివేసిన భారీ వాహనాలు

తడ ఎంపీడీవోగా మురళీకృష్ణ



తడ: మండల ఎంపీడీవోగా ఏవీ మురళీకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో కె.ఆమోసుబాబు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ క్రమంలో మురళీకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నెల్లూరు జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణ